క్లుప్తంగా

ఉప్పుటేరు ఆక్రమణలపై సర్వే



ఉప్పుటేరు గట్టుపై ఉన్న ఇళ్లు

ఆకివీడు: బుడమేరు వరద ముంపు నుంచి రక్షణకు ఉప్పుటేరు ప్రక్షాళన చేపట్టాలని ఈ ప్రాంత ఎమ్మెల్యేలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంతో డ్రెయినేజీ, రెవిన్యూ అధికారులు ఉప్పుటేరు సర్వే ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఉప్పుటేరు ప్రాంతంలోని ఆక్రమణలను సర్వే చేశారు. ఈ ప్రాంతంలో సుమారు 32 ఆక్రమణ ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిని త్వరలో తొలగించాలని సూచించినట్లు అధికారులు చెబుతున్నారు.

పదో తరగతి విద్యార్థినికి నగదు పురస్కారం అందజేత



ఏలూరులో నగదు పురస్కారం అందుకుంటున్న కొల్లి శాన్వి

ఆకివీడు: జెడ్పీ ప్రభుత్వ పాఠశాలలో చదివి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఉమ్మడి జిల్లా కేంద్రం ఏలూరులోని జెడ్పీ కార్యాలయంలో గురువారం సత్కరించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కొల్లి శాన్వి మండలంలో 590 మార్కులు అత్యధికంగా సాధించడంతో ఆమెకు రూ. 10 వేలు నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ, సీఈఓ, రెండు జిల్లాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తోట పోతరాజు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికుల పింఛన్ పెంచాలి



బొబ్బిలి బంగారయ్య

ఆకివీడు: వయోభారంతో ఇంటి వద్ద ఉంటున్న అసంఘటిత రంగ కార్మికుల పింఛన్లను పెంచాలని సహకార సంఘాల, గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, వినియోగదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల పింఛన్‌ను గత 15 ఏళ్లగా పెంచుతామని చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. నెలకు రూ. 1000 నుంచి రూ.1500తో ఏ విధంగా జీవనం గడుపుతారని వాపోయారు. కార్మికులు, ప్రైవేటు ఉద్యోగులకు పింఛన్‌ను తక్షణం రూ.7,500 లకు పెంచాలని డిమాండ్ చేశారు.

గ్రామదేవతకు వెండి వస్తువుల సమర్పణ

కాళ్ల: స్థానిక శ్రీ మహంకాళమ్మ, శ్రీవెంకమ్మ అమ్మవార్లకు వెండి వెండివస్తువులు గ్రామానికి చెందిన వీరమల్లు రాజబాబు జ్ఞాపకార్థంకుమారులు శోభన్ కుమార్, సురేష్ కుమార్, కుటుంబ సభ్యులు గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సుమారు రూ.35 వేలు విలువైన వెండి శఠగోపం, హారతి గ్రామదేవతల జాతర సందర్భంగా అమ్మవార్లకి సమర్పించారు. తొమ్మిది రోజులపాటు జరగనున్న జాతర సమయంలో ఆలయంలో అందుబాటులో ఉంచనున్నట్లు వారు తెలిపారు.

వెండి పీఠానికి 105 గ్రాముల వెండి అందజేత

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి పీఠానికి దాతలు 105 గ్రాముల వెండిని సమర్పించారు. గురువారం భీమవరం మండలం గుట్లపాడుకు చెందిన వర్దినీడి నాగేశ్వరరావు 105 గ్రాముల వెండిని ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు.

ముగిసిన సువార్త సభలు

కాళ్ల: మండలంలోని బోస్ కాలనీలో మూడు రోజులపాటు నిర్వహించిన ఆధ్యాత్మిక సువార్త మహాసభలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఆఖరిరోజు ముఖ్య అతిథిగా బ్రదర్ అనిల్ కుమార్ ప్రసంగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి క్రైస్తవులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోవాలి

అత్తిలి: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ నిధులు రూ.12.65 లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్‌ను, రూ. 3.90 లక్షలతో అభివృద్ధి చేసిన వాలీబాల్, షటిల్, కబడ్డీ, లాంగ్ జంప్ కోర్టులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ శ్యాంసుందర్, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎన్ వేణుగోపాల్, గారపాటి బాబ్జి,గారపాటి ధర్మయ్య, ముత్యాల నాగేశ్వరరావు, విత్తంశెట్టిసత్తిబాబు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం

- ఘనంగా మేడే వేడుకలు
- ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని నాయకుల ఉద్ఘాటన



భీమవరం: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే నిర్వహిస్తున్న దృశ్యం



భీమవరం: మే డే సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి



వీరవాసరం: మేడే నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

భీమవరం: కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేసేవరకు ఐక్యంగా పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్ పిలుపునిచ్చారు. గురువారం మేడే సందర్భంగా భీమవరం సీఐటీయూ కార్యాలయం వద్ద యూనియన్ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వి గోపాలన్ కార్మిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీతారామ్ మాట్లాడుతూ కార్మికులు ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తుందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి హక్కులు చట్టాలు, 1991 తర్వాత చేసిన చట్టాలు, రాయితీలను నేటి ప్రభుత్వాలు తొలగిస్తున్నాయన్నారు. మేడే సందర్భంగా పట్టణంలో పెద్ద సంఖ్యలో కార్మికులతో చేసిన మహా ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. సీఐటీయూ జిల్లా కార్యాలయం నుంచి మావుళ్ళమ్మ గుడి రోడ్డు మీదగా ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్, గాంధీ చౌక్ , నటరాజ్ థియేటర్ రోడ్డు, బొంబాయి స్వీట్ రోడ్ మీదగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, మెడికల్ రిప్రజెంటేట్ యూనియన్ రాష్ట్ర నాయకుడు ఎస్.శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎన్. రాజు, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు షేక్ వలి, సీతారాంప్రసాద్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని మున్సిపల్ వర్కర్స్ కాలనీ, ఇండస్ట్రియల్ ఎస్టేట్, చినరంగనిపాలెం, శ్రీనివాసా సెంటర్, తిరుమల కళాశాల, బంట్రోతుల చెరువు తదితర ప్రాంతాల్లో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎం.లక్ష్మీపతి, నీలాపు శ్రీను, బంగారు శివ తదితరులు పాల్గొన్నారు

ఐక్య పోరాటాలతో సమస్యల పరిష్కారం

వీరవాసరం: పనిగంటలు, ఓటు హక్కులు, ఇతర అనేక కార్మిక చట్టాలు రూపొందటానికి ప్రపంచంలో కార్మిక వర్గం చేసిన పోరాటాలే కారణమని మేడే చాటి చెప్పిందని పలువురు వక్తలు తెలియజేశారు. మేడే సందర్భంగా వీరవాసరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ రైతు నాయకులు జుత్తిగ నరసింహ మూర్తి, సీఐటీయూ నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ మేడే ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో బొర్రా అలమహారాజు, బాలం విజయ్ కుమార్, యండమూరి సుబ్బారావు, జ్యోతి బస్సు, కొత్తల సత్తిబాబు, డి.వరలక్ష్మి, సత్యవతి, శ్యాం బాబు, మద్దాల శ్రీను, రాము, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన లేబర్ కోడ్‌తో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అన్నారు. మండలంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండా సూరిబాబు, దావులూరి మార్తమ్మ, పైడితల్లి, వెంకటేశ్వరరావు, శ్రీను, రామలక్ష్మి తదితరుల పాల్గొన్నారు.

కార్మికుల ప్రాణత్యాగానికి ప్రతీక మేడే

ఉండి: ఎంతో మంది కార్మికుల ప్రాణత్యాగాలే మేడే వేడుకలు అని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు హసీనాబేగం అన్నారు. ఉండి సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఉండి సెంటర్‌లోని సిరికి రాములు విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చీర్ల శేషు, నాయకులు ధనికొండ శ్రీనివాస్, వీరవల్లి మాధవరావు, చిప్పాడ బుచ్చేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు ఆధ్వర్యంలో మేడేను నిర్వహించారు.

ఆకివీడులో..

ఆకివీడు దేశ ప్రగతి రథ చక్రాలు కార్మికులని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ అన్నారు. స్థానికంగా గురువారం మేడే వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల సీపీఎం పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక వెలంపేట రామాలయం వద్ద బహిరంగ సభ సందర్భంగా ప్రధాన రహదారి మీదుగా సీపీఎం కార్యకర్తలు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూలంగా పని చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంకి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.తవిటినాయుడు, బి.సత్యనారాయణ, బీవీ వర్మ, డి.రవితేజ, ఉదయకుమారి, దోకల లక్ష్మి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

వెంపలో..

భీమవరం అర్బన్: మండలం రూరల్ వెంప బస్టాండ్ సెంటర్లో ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ జెండా ఆవిష్కరించి మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేరేడుమిల్లి సంసోను మాట్లాడుతూ మేడే విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో కనుమూరి కృష్ణంరాజు, కోడి సత్యనారాయణ, పెదపాటి శుభకరం, ఇంజేటి రవికుమార్, శ్రీనివాసరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



పాలకోడేరు: మానవహారం చేస్తున్న కార్మికులు

పాలకోడేరు: బీజేపీ కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దూసి కళ్యాణి పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా పాలకోడేరు మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు, స్కీం వర్కర్లు అన్ని రంగాల కార్మికులతో సొసైటీ వద్ద సభ నిర్వహించారు. తొలుత సీనియర్ కార్మికుడు వెంకట్రావు జెండా ఆవిష్కరించారు. అనంతరం రావి చెట్టు సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా దూసి కళ్యాణి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులపై పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటలు పని దినాలను బీజేపీ ప్రభుత్వం బడా కార్పొరేట్ల కోసం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు అత్రియ్య, సీఐటీయూ నాయకులు దున్నా మరియమ్మ, శాలిని, కుమార్, గోపాల రాజు, సుబ్బారావు , చేబోలు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



కాళ్ల: ఎర్రజెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



ఉండి: సీఐటీయు ఆధ్వర్యంలో మేడే నిర్వహిస్తున్న కార్మికులు



ఆకివీడు: మేడే ప్రదర్శనలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్



భీమవరం అర్బన్: వెంప బస్టాండ్ వద్ద మేడే నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్టీసీ కార్మికులకు చట్టాలపై అవగాహన



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

భీమవరం: మహనీయుల త్యాగాల కారణంగా కార్మికుల హక్కుల సాధించుకున్నందుకు గుర్తుగా కార్మికుల దినోత్సవం చేసుకుంటున్నారని భీమవరం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయసేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో కార్మికులతో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాల పరిరక్షణకు న్యాయస్థానాలు ఉన్నాయని ఎవరికైనా హక్కులకు భంగం కలిగితే న్యాయ స్థానాలను ఆశ్రయించవచ్చని తెలిపారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేకుంటే కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్ బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, డిపో మేనేజర్ పీవీవీఎస్ఎన్ మూర్తి, ప్యానల్ న్యాయవాదులు పి.అంబేద్కర్, కె.జ్యోతి, ఎన్.సుధీర్, డి.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.రామకృష్ణరాజు అన్నారు. గురువారం డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బలుసుమూడి రోడ్డులో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కటికల పల్లారావు,పాకలపాటి సీతారామరాజు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఉచిత వైద్య శిబిరాలు, దాతల సహకారంతో గత రెండేళ్లుగా మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాగి త్యాగరాజు, జాలీ వాకర్ జి.అప్పలరాజు, పీఆర్‌ఓ కె.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు మహాభారతం, కురువంశ వృక్షం అభివృద్ధి, శ్రీరాముల కథలను ఎండీ సరోజిని వివరించారు. అలాగే గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు జనరల్ నాలెడ్జ్, పుస్తక సమీక్ష, పుస్తక పఠనం చేయించగా డ్యాన్స్ మాస్టర్ జె.శ్యామ్ నృత్య శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూన్ 6 వరకు నిర్వహించే విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు .

ఆరేడులో ఉచిత నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: నేత్రదానంపై సామాన్యులు అవగాహన పెంచుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రమ్మారెడ్డి,ముదునూరి శివరామరాజు అన్నారు. గురువారం మండలంలోని ఆరేడు గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సర్పంచ్ కట్రెడ్డి బ్రహ్మనందం ప్రారంభించారు. నిడదవోలుకు చెందిన రాజరాజేశ్వరీ రామకృష్ణ లయన్స్ కంటి ఆస్పత్రి సిబ్బంది వైద్య సేవలు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 120 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలిగొట్ల సర్పంచ్ సత్యసూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు రుద్రరాజు యువరాజు, డాక్టర్ గాదిరాజు రంగరాజు, సాగిరాజు అప్పలరాజు పాల్గొన్నారు.

సుబ్బయ్యకు సత్కారం



భీమవరంలో సుబ్బయ్యను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: అంబేద్కర్ ఫౌండేషన్ మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ ఎంపవర్ మెంట్ ఆఫ్ ఇండియా జాతీయ సభ్యుడిగా నియమితుడైన భీమవరం పట్టణానికి చెందిన గరికిముక్కు సుబ్బయ్యను గురువారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ప్రైవేటు కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అసోసియేషన్ కన్వీనర్ రాజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుబ్బయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అబివృద్ధిలో అంబేడ్కర్ ఫౌండేషన్ ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. కార్యక్రమంలో భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.న్యూటన్, కె.శ్రీనివాస్, జీపీఎల్ఏ ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ, జీసీఎల్ఏ వర్కింగ్ ప్రెసిడెంట్ జీఎం దయాకర్, ఆంధ్ర విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ గూడపాటి శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులను సత్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులంతా ఒక ఉద్యమంగా చేపట్టాలని సర్పంచ్ భూపతి రాజు జగ్గ బాబు రైతులందరికీ తెలిపారు. ఏలూరుపాడు గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిన్నాపరపు రాంబాబు మాట్లాడుతూ రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులందరూ ముందుకు వచ్చి ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నాలుగు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఒక్కపట్ల హరిబాబు, ఉండి డివిజన్ ఇన్‌చార్జ్ ఎస్ఎఫ్ఏ మహేష్, రవణమ్మ, రాజేశ్వరి, దుర్గ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం: భీమవరం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ తాడేరు పరిధిలో 11 కేవీ తాడేరు బ్యాంకు కాలనీ ఫీడర్‌పై చెట్లు, కొమ్మలు, తొలగించడానికి శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని నాచువారితోట, అమ్మిరాజుతోట, చిన అప్పారావుతోట, సెంట్‌ఆన్స్ స్కూల్ రోడ్, బ్యాంకు కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

ఆకివీడులో..

ఆకివీడు: స్థానిక 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీ లైన్లలో చెట్లు, చెట్టు కొమ్మలు తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. వెంకటేశ్వరరావు గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలోని అజ్జమూరు, దుంపగడప, గుమ్ములూరు, తాళ్లకోడు, కుప్పనపూడి, అయిభీమవరం, ఆకివీడు పట్టణంలోనూ, మాదివాడ, సమతానగర్, ఇండస్ట్రీయల్ ఏరియా ప్రాంతాల్లో సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వివరించారు.

ఉండిలో..

ఉండి: యండగండి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం 11 కేవీ విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించేందుకు శుక్రవారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ నేపథ్యంలో ఉణుదుర్రు, యండగండి గ్రామాల్లోని విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరోగ్య సురక్ష ఊసేది?

- ప్రజాపయోగ పథకాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆసుపత్రుల చుట్టూ తిరగలేక దివ్యాంగులు, వృద్ధుల ఇబ్బందులు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన రోగులు..

కాళ్ల: ప్రతి పేదవాడు అనారోగ్యంతో ఇబ్బందులు పడకూడదనే సంకల్పంతో ఎక్కడా లేని విధంగా ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించేలా జగనన్న సురక్ష పథకం గత వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ పథకం కింది ప్రజలకు ఉచితంగా నాణ్యమైన విద్య,వైద్యం అందించారు. పేద ప్రజలకు వైద్యం ఇంటి వద్దనే అందించాలని ×జగనన్న ఆరోగ్య సురక్ష¥ పేరుతో కార్యక్రమాలను నిర్వహించారు. ఆ సమయంలో ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సేవలందించేవారు. ప్రతి నెలా తమ ఏరియాలో నిపుణులైన వైద్యులు, సిబ్బంది వచ్చి 14 రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పూర్తిగా ఉచితంగా అందించేవారు. మెరుగైన వైద్యం అవసరమైతే సమీపంలోని ఆరోగ్యశ్రీ ఉన్న ఆసుపత్రికి తరలించే వారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ సేవలన్నిటికీ మంగళం పాడింది. దీంతో అనారోగ్యం వస్తే ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

ప్రజారోగ్యాన్ని పట్టించుకోని వైనం

నెల రోజులుగా ఎండలు అధికంగా పెరగడంతో వడదెబ్బతో పాటు పలు వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గంలో ఒక సీహెచ్ పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో రోజుకు సుమారు 350 నుంచి 400 మంది వైద్య పరీక్షల కోసం వస్తున్నారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు వ్యాధులతో బాధపడుతున్నారు. ఆసుపత్రులకు రాలేని వారి పరిస్థితి దయనీయంగా మారింది. కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పడకేసిందని రోగులు వాపోతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాణ్యమైన వైద్య సేవలను అందిస్తే కూటమి సర్కారు ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిందని విమర్శిస్తున్నారు.